# నన్ను ముట్టుకోకు నామాల కాకి

"మీ తమ్ముడు గారి పెళ్ళి పేరున హైద్రాబాద్‌లో హాయిగా ఆర్రోజులు గడిపే గోల్డన్ ఛాన్స్ దొరికింది గదండీ." సింధూర వర్ణ సింధూర కాటుక కళ్ళు కలువరేకుల్లా విచ్చుకున్నాయి.

రెచ్చిపోయిన భర్త పెదాలు... నున్నటి చెంపలను సన్నగా స్పర్శించబోతే చలాకీగా తప్పుకుని "ముందు ఆఫీసుకెళ్లి సెలవు పెట్టిరండి" పంపించింది. ఆఫీసులో సెలవు చీటీ ఇచ్చి వస్తున్న భర్త కెదురెళ్లి "అయ్యో రామా ! పెళ్లికి వెల్దామని తయారవుతుంటే చావువార్త వచ్చిందండీ!" అప్పుడే వచ్చిన టెలిగ్రాం చూపించింది.

"ఎవరీ మురళీ ? అతని తల్లి చనిపోయిందట గదా !" అద్దాల్లాంటి అర్ధాంగి చెక్కిళ్లలో మొహం చూసుకుంటున్నాడు నరేందర్. గంట క్రితం అరవిరిసిన పుష్పంలా కళకళలాడ్తున్న సిందూర మొహం పగటి కలువలా కనబడింది.

"మురళన్నయ్య మా చిన్నమ్మ కొడుకు. చనిపోయింది మా చిన్నమ్మనే..."

"అలాగా ! అయితే తప్పకుండా వెళ్లాలి. మా చిన్నమ్మ కొడుకు పెళ్లికింకా నాల్రోజుల టైముంది గదా !"

"ఏమోనండి... మా మురళన్నయ్య... వాడదో తరహా మనిషి అసలా టెలిగ్రాం రాకుండా వుంటే బావుండేదనిపిస్తుంది."

"అదేంటి సిందూ ! కష్టసుఖాల్లో కలుసుకుని ఒకరినొకరు సహకరించుకోవడమే గదా బంధుత్వమంటే..."

"నిజమే కాని... వాడు మన పెళ్లికి రాలేదు. కాని మా చిన్నమ్మ చాలా మంచిదండీ. అప్పుడే ..." బాధతో గొంతు పెగల్లేదు.

"అప్పుడతని పరిస్థితి ఏమిటో ...."

"అదో పల్లెటూరు...."

"పల్లెనో, పట్నమో... బయల్దేరు. ముందటే వెల్దాం."

ఏరి, కోరి నరేందర్ మూడు ముళ్లేయేంచుకున్నాక మూడు రాత్రుల ముచ్చట ఇంట్లోనే జరిగింది. ఓ మూన్నాల్గురోజులెటన్నా వెళ్లొద్దామంటే కుదరలేదు. అసలైన దాంపత్య సుఖం పిల్లాపాప లేక ముందే గదా ! రాష్ట్ర రాజధానిలో రంజుగా గడిపేద్దా మనుకుంటే... ప్చ్... పల్లెటూరుకు బయలు దేరాలాయె.

"మీ చిన్నమ్మ చనిపోయింది మొన్న సాయంత్రం గదా !" బస్సులో అడిగాడు నరేందర్.

"అవును... మురళన్నయ్య ఒక్కడే సంతానం..."

"పాపం ! నిన్న పట్నమొచ్చి టెలిగ్రామిచ్చుంటాడు. ఇంతకీ మనం వెళ్లేసరికి అంతా ఐపోతుందేమో !"

"ఐపోతే ... పలుకరించి వెంటనే తిరిగొద్దాం. మా చిన్నమ్మ నన్నెంతో ప్రేమగా చూసేదండీ !" చిన్నప్పుడు చిన్నమ్మ ఒడిలో ఆడుకున్న దృశ్యం గుర్తుకొచ్చి కళ్లను తడిచేసింది.

పల్లెటూరు చేరేసరికి మధ్యాహ్నం పన్నెండు దాటింది.

ఇంటి ముందు ఎవరూ లేరు. అటూ ఇటూ చూస్తూ లోపలి కెళ్లారు. దివాలా తీసిన మార్వాడీలా మురళి చేతులు నెత్తికి పెట్టుకుని గోడకొరిగి కూర్చున్నాడు. పక్కన శవముంది. ఇల్లంతా ... శూన్యం ... హడావుడే లేదు. సిందూరకు దుఃఖమాగలేదు.

"అన్నయ్యా ... ఎంత పనైందన్నయ్యా ....?" బోర్‌మంటూ మురళి చేతులందు కుంది.

"సిందూరా ... వచ్చావా... చూడు.... అమ్మను చూడమ్మా !" బావురుమన్నాడు మురళి.

"ఏచ్చావా వదినా ... !" లోపలి నుండి బయటికొచ్చింది మురళి భార్య నళిని. "చూడు ... మీ అన్నయ్య పరిస్థితి చూడు ..." చంకపాపను దింపేసి కళ్లద్దుకుంది.

ఏడ్పులు, ఊరడింపులతో పావుగంట గడిచింది. తర్వాత సిందూర తన భర్తను పరిచయం చేసింది.

"నేనో దురదృష్టవంతుడిని బావా !" పొంగుకొస్తున్న బాధను, అవమానం తాలుకు ఛాయల్ని గొంతులో అదిమి పెట్టి నుదురు కొట్టుకున్నాడు మురళి "శవాన్ని తీసుకెళ్లాలంటే ... ఎవ్వరూ దిక్కులేరు ..."

"అదెట్లా !" ఆశ్చర్యంగా ఉంది నరేందర్‌కు. "బంధువులు, మిత్రులు, ఇంటి పక్కల వాళ్ళు ... " నమ్మశక్యం కాలేదు.

"అయ్యో దేవుడా !" నళిని మూతి మూడువంకర్లు తిరిగింది" వాళ్లంతా ఈయన గారికిప్పుడు గుర్తుకొస్తున్నారన్నయ్యా. బంధుమిత్రులు, ఇంటి పక్కల వాళ్లింట్లో చావులైనా, శుభకార్యాలైనా ఈయనసలు వెళ్తేగదా ! దేనికీ వెళ్ళేది లేదాయె. అయినప్పుడు మనింటి కెందుకొస్తారు ?"

"నిజంగానా !" నరేందర్‌కింకా నమ్మకం కుదరడం లేదు.

"ఎన్ని సార్లు చెప్పినా ఈయన పట్టించుకోలేదు. నన్ను ముట్టుకోకు నామాల కాకి అన్నట్లు... ఎందరింట్లో శుభకార్యమైనా, ఎన్ని ఆహ్వానాలొచ్చినా పట్టించుకోరాయె"

రోషం, ఉక్రోశం నళిని గుండెల్ని ఎగరేస్తున్నాయి.

"మొదట్నించీ అంతేనటా. ఏమన్నా అంటే... వెళ్లి మనమేమన్నా చచ్చినవాళ్లకు ప్రాణం పోస్తామా అనో, మనం వెళ్లక పోతే పెళ్లి ఆగిపోతుందా అనో సమర్థించుకోవడమాయె. ఇప్పుడు చూడండి ఎంత గతి పట్టిందో..." నేలమీద కూలబడి శోకాలందుకుంది.

నేలకు వేళ్లాడుతున్న మురళి తల పైకి లేవట్లేదు.

శవ దుర్గంధం ముక్కుపుటాలకు సోకుతుంది.

ఈ ఆధునిక అణుయుగంలో ఇలాంటి మనుషులు గూడా ఉంటారా ! అంతా అయోమయంగా ఉంది.

"అయ్యో చిన్నమ్మా... నీకెంత గతి పట్టిందే..." గోడ కొరిగి కూచున్న సిందూర గొల్లుమంది.

పరిస్థితి అంతా అర్థమైంది నరేందర్‌కు. ఏదో ఒకటి చెయ్యాలన్పించింది. కాని... ఈ పరిస్థితిలో మురళికేం చెప్పాలో, తనలోని ఆవేశాన్నెలా అణచుకోవాలో అర్థం కాలేదు. సమయస్ఫూర్తి, సంయమనం... ఏవో ... ఇంకేదే దో ... తనకు తానే కంట్రోల్ చేసుకోవాల్సి వచ్చింది.

"సిందూ ! నళినక్కయ్యా ! మీరలా ఏడుస్తూ కూచుంటే ఎట్లా ? కాగల కార్యం... జరిగి తీరాలి గదా !" మందలించాడు. ఇద్దరూ ఏడుపు ఆపేసి కొంగులతో కళ్లద్దుకున్నారు.

"అక్కయ్యా !" నళిని నుద్దేశించి "ముందు మీరు కొన్ని నాఫ్తలిన్ బాల్స్ కొనుక్కొచ్చి శవం చుట్టూ పెట్టండి." చెప్పేశాడు.

"బావా ! ముందు మీరు లేవండి." మురళి చెయ్యిబట్టి లేపాడు. "ఇప్పుడు చేతులు ముడుచుక్కూచుంటే కుదరదు. మీ స్నేహితులను చూపించండి."

ఎవరింటికెళ్లినా ఒకే రకమైన మాటలు.

"మా అమ్మమ్మ చనిపోయినప్పుడు ఈయనగారి మొహమన్నా కనబడలేదు."

"మా తాత గారు చనిపోయినప్పుడు ... ఇంటి ముందు నుంచి వెళ్లాడు కాని లోపలికి రాలేదు."

"మా చెల్లి పెళ్లప్పుడు వచ్చి కాస్త సాయం చెయ్యమని అడిగినా రాలేదు."

"మా నాన్న షష్ఠి పూర్తప్పుడు ఊళ్లో లేనన్నాడు. కనీసం భోజనానికిగ్గూడా రాలేదు."

"ఆయన సంగతి ఆయన చూస్కుంటాడులే...."

మాటలు కావవి... పదునైన ఈటెలు, సూటిగా గుండెలకు గుచ్చు కుంటున్నాయి.

నిరాశగా తిరిగొస్తున్నాడు. నడి బజారులో మురళికి దుఃఖమాగట్లేదు. జీవితములో ఎన్నడూ, ఎవ్వరూ చెప్పని పాఠము అనుభవమవుతోంది.

"ఈ ఊళ్లో కాష్టానికి కట్టెలెవరు తెస్తారో, ఆ ఏర్పాట్లు ఎవరు చూస్తుంటారో తెలుసా బావా ?" స్వయంగా కార్యరంగములోకి దిగాలనుకున్నాడు నరేందర్.

"నాకవేవీ తెలీవు బావా !" గుడ్లల్లో నీళ్లు తిరుగుతూంటే ఓ అరుగుమీద కూలబడ్డాడు మురళి. "శవాన్ని మోసేందుకైనా నలుగురు కావాలి గదా ... ఛీఛీ..." చేతి గుడ్డ నోటికడ్డంగా పెట్టుకున్నాడు. తన మీద తనకే అసహ్యమేస్తుంది.

"అందుకే అన్నారు బావా నలుగురితో కలిసుండాలని..." ఇంకేదో అనబోతున్న నరేందర్ భుజమ్మీదో చెయ్యి పడింది.

"ఒరేయ్ నరేందర్ ... నువ్వేనా ." వెనకనుండి పలకరింపు.

"ఒరే ఆనంద్ ... నువ్విక్కడా !" పొంగుకొస్తున్న సంతోషం కరచాలనం చేయించింది. ఇంగితజ్ఞానం గాంభీర్యం వహించుమంది.

"నేనిక్కడ టీచరుద్యోగం చేస్తున్నా. ఇదే ఇంట్లో ఉంటున్నా. నువ్వెప్పుడు ఎట్లా ఊడి పడ్డావురా !" అంటూ ఇద్దరిని ఇంట్లోకి లాక్కెల్లాడు ఆనంద్.

ఆనంద్, నరేందర్ బాల్య స్నేహితులు. క్లాసుమేట్సు. ఆ రోజుల్లో ఇద్దరూ కలిసి సంఘశాఖలో ఆడుకోవడం, పాడుకోవడం గుర్తుకొస్తోంది. పరిస్థితి అంతా ఆనంద్‌కు చెప్పేశాడు నరేందర్.

"అరెరే... అట్లానా ?" విస్తుబోయాడు ఆనంద్. "మనిషి సంఘజీవి గదా మురళి గారూ !" వంగిన మురళి తల చూడాలన్పించలేదు. "మీరు మీ ఇంట్లో ఏర్పాట్లు చేసుకోండి. నేనో గంటలో బయటి ఏర్పాట్లు పూర్తి చేసుకొస్తా"నని బయలు దేరాడు.

ఆనంద్ పదిమంది స్వయంసేవకులతో రావడం, తల్లి శవయాత్ర సజావుగా జరగిపోవడం... అష్టకష్టాల్లోంచి అవలీలగా గట్టెక్కినట్టనిపించి, మురళి శరీరంలోని అణువణువూ కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. అందరి చేతులందుకుని కళ్ళకద్దు కుంటూ "నా కళ్లు తెరుచుకున్నాయండీ" అనేశాడు.

నరేందర్, సిందూరలు తిరిగి వెల్తూంటే అంతరాళాల్లో అష్టమ సముద్రం పొంగింది.

"నిజమే ... మనిషి సంఘజీవి. నేనిప్పట్నుంచి సంఘం కోసం జీవిస్తాను" స్థిర నిర్ణయం ప్రకటించాడు.

"నన్ను ముట్టుకోకు నామాల కాకి అంటూ ఏకాకిగా మిగిలిపోను."

*(జలధి, 16-10-2003)*